ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 19 మార్చి 2024






| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 26 | 35 |
| భద్రాద్రి | 20 | 33 |

రంజాన్‌మాసం



ఇఫ్తార్ (సా) : 6:25 (మంగళవారం)
సహర్ (ఉ) : 4:53 (బుధవారం)

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 18: చెక్‌పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. లోకసభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, నయాబజార్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ చెక్‌పోస్టును కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. పటిష్ఠ నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసిందీ.. అడిగి తెలుసుకున్నారు.ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్

# చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- నగదు, మద్యం రవాణాను నియంత్రించాలి
- ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతీ చెక్ పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా వుంటూ, 24గంటల పటిష్ఠ నిఘా పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి తదితరులు ఉన్నారు.

**నియమావళిని అమలుచేయాలి**

అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని అన్ని శాఖల కార్యాలయాలను సందర్శించారు. రాజకీయ నేతల, రాజకీయ పార్టీలకు సంబంధించి క్యాలెండర్లు, పోస్టర్లు ఫొటోలు తొలగించింది లేనిదీ పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల్లో 24 గంటల్లో, పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద 48గంటల్లో, ప్రైవేటు స్థలాల్లో 72 గంటల్లో రాజకీయ నేతలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్స్ ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించాలని, విగ్రహాలకు ముసుగు వేయాలని తెలిపారు.

ఎన్నికల సంఘం ఆదేశాలు, నియమ నిబంధనలు అధికారులు, సిబ్బంది తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**ఫ్లయింగ్‌స్క్వాడ్ వాహనాల ప్రారంభం**

స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణలో భాగంగా క్షేత్రస్థాయిలో నిఘా కొసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ బృందాల వాహనాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ నూతన కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఖమ్మం నియోజకవర్గంలో 3, పాలేరు నియోజవర్గంలో 3, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో రెండు చొప్పున విధులు నిర్వర్తిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సీపీవో శ్రీనివాస్, ఎంవీఐ వెంకటరమణ, అదనపు పౌర సంబంధాల అధికారి వి.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

## రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లొద్దు..

- ఎన్నికల కోడ్‌కు అందరూ లోబడి ఉండాలి
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్
- వల్లభి వద్ద చెక్‌పోస్టు తనిఖీ



ముదిగొండ, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల కోడ్ దృష్ట్యా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. సోమవారం ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొహరించిన కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు ఇతరత్రా వస్తువులను సీజ్‌చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. రూ.50వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదని, పెద్దమొత్తంలో నగదు, నగలు ఉంటే తప్పనిసరిగా సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలు షురూ

**తొలిరోజు ప్రశాంతం**

- ఖమ్మం జిల్లాలో 51మంది.. భద్రాద్రి జిల్లాలో 71మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఇరు జిల్లాల కలెక్టర్లు
- అన్ని వసతులు కల్పించిన అధికారులు
- మాల్ ప్రాక్టీస్ జరగకుండా పోలీసుల బందోబస్తు



ఖమ్మంలో ఓ పరీక్షా కేంద్రం వద్ద..

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 18: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు ఖమ్మం జిల్లాలో మొత్తం 16,582 మంది రెగ్యులర్ విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా.. 16,543మంది పరీక్ష హాజరయ్యారు. 39మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 58మంది ఉండగా.. 46మంది పరీక్షకు హాజరయ్యారు. 12మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్షల తీరును కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని నయాబజార్ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. మొబైల్ ఫోన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వైద్యశిబిరం వద్ద మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు.

**భద్రాద్రి జిల్లాలో 99.5శాతం హాజరు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 12,341మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 12,286మంది పరీక్షకు (99.5శాతం) హాజరయ్యారు. 55 మంది గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు 74మంది ఉండగా 58మంది పరీక్షకు హాజరయ్యారు. 16మంది గైర్హాజరయ్యారు. చండ్రుగొండ మండలానికి చెందిన ఓ విద్యార్థి పొరపాటున కొత్తగూడెంలో బాబుక్యాంపు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి వచ్చి అది తన పరీక్ష కేంద్రం కాదని తెలుసుకొని ఆందోళన చెందాడు. దాంతో అక్కడే విధుల్లో ఉన్న చుంచుపల్లి ఎస్ఐ గడ్డం ప్రవీణ్‌కుమార్ అతడి హాల్‌టికెట్‌ను పరిశీలించి అతడి సెంటర్ చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉండటంతో ఎస్ఐ స్వయంగా తన వాహనంలో సదరు విద్యార్థిని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి మానవత్వాన్ని చాటుకొన్నాడు. పరీక్ష నిర్వహణను జిల్లా పరీక్షల పరిశీలకుడు పి.మదన్‌మోహన్, కలెక్టర్ ప్రియాంక, డీఈవో వెంకటేశ్వరాచారి పర్యవేక్షించారు.



పాల్వంచలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



ఖమ్మంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**విషమ 'పరీక్ష'**

- పరీక్ష రాసి తిరిగి వచ్చేసరికి కన్నుమూసిన తల్లి..
- తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే పరీక్షకు..
- కొత్తగూడెం, కల్లూరు శ్రీరామపురంలో విషాద ఘటనలు

6

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఏడాది క్రితం భద్రాద్రి జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాల అనేకానేక సమస్యలతో సతమతమవుతోంది. మౌలిక సౌకర్యాలు లేక కునారిల్లుతోంది. పూర్తిస్థాయి భవనాల నిర్మాణం జరగక పోవడంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. వైద్య విద్య అనేది సకల వసతులు, ఉన్నత ప్రమాణాల మధ్యన సాగినపుడే ప్రతిభావంతులైన డాక్టర్లు తయారవుతారు. కానీ గత ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిన నూతన వైద్య కళాశాలల్లో కనీస వసతులు కూడా లేకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. కొత్తగూడెం వైద్య కళాశాలలో నర్సింగ్ కళాశాల కోసం నిర్మించిన భవనంలో ఎంబీబీఎస్ తరగతులను నడుపుతున్నారు. కొత్తగా వైద్య కళాశాల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ. 500కోట్ల నిధులను మంజూరు చేసింది. నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో ఆ వైద్య కళాశాల నిర్మాణం పునాదులకే ప్రస్తుతం పరిమితమైంది.



మెడికల్ కాలేజీ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

# వైద్య మిథ్య

**కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక వసతుల కరువు**

- నర్సింగ్ కళాశాల భవనంలో తరగతుల నిర్వహణ
- శాశ్వత భవనాలు నిర్మించేది ఎప్పుడో
- విద్యా ప్రమాణాలు కల్పించాలంటున్న మెడికోలు
- 2022లో హడావిడిగా ప్రారంభించిన బీఆర్ఎస్ సర్కారు

కొత్తగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లాగా పేరు గడించిన భద్రాద్రి జిల్లా కేంద్రంలో 2022 నవంబరులో 150 సీట్లు మంజూరు చేసి వైద్య కళాశాలను ప్రారంభించారు. 2022-23 ఏడాదిలో కళాశాల తొలిబ్యాచ్‌కు 150 సీట్లకు గాను 149 సీట్లు భర్తీ అయ్యాయి. సెంట్రల్‌పూల్ విభాగంలో ఓ విద్యార్థిని సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. కళాశాలలో 2023-24 రెండో బ్యాచ్ కోసం రెండు విడతలుగా ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగియడంతో 150 సీట్లు భర్తీ అయ్యాయి. కళాశాలకు ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్ఎల్ లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్‌గా అనిల్ వ్యవహరిస్తున్నారు. మరో 101మంది అధ్యాపకులు బోధన అందిస్తున్నారు.

**విద్యార్థుల ఇక్కట్లు..**

కొత్తగూడెం వైద్య కళాశాలలో రెండు బ్యాచ్‌లకు కలిపి సుమారు 300మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో సరైన హాస్టల్ వసతి లేకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. కళాశాల ప్రాంగణంలో బాలురకు, బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలను నిర్మించేందుకు గతేడాది నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కానీ నిధులు సక్రమంగా లేకపోవడంతో అవి నిర్మాణ దశలోనే (పిల్లర్స్) నిలిచిపోయాయి. అదేవిధంగా కళాశాలలో తొలి ఏడాది విద్యార్థులకు బోర్డు తుది పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లు విధులకు హాజరవుతుండగా, ఆర్ అండ్‌బీ అతిథి గృహం లేకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడక తప్పలేదు. అదేవిధంగా విద్యార్థులు ఆటవిడుపుగా గడిపేందుకు క్రీడా మైదానాలు కరువయ్యాయి. టెండరు ప్రక్రియను నిర్వహించి కళాశాల ఆవరణలో క్యాంటీన్‌తోపాటు స్టేషనరీని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. ఇప్పటికీ అవి పూర్తి కాలేదు.

**ప్రిన్సిపాల్ తీరు వివాదాస్పదం**

సమస్యలతో సతమతమవుతున్న కళాశాలలో.. ప్రిన్సిపాల్ తీరు కూడా వివాదాస్పదంగా మారింది. కనీస సౌకర్యాలు లేవని, ల్యాబ్‌ల్లో సరైన పరికరాలు లేవని ప్రశ్నించినందుకు తమను టార్గెట్ చేసి సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సీనియర్లు, జూనియర్లు కలిసి మాట్లాడుకుంటే ర్యాగింగ్




పేరుతో చర్య తీసుకుంటానని బెదిరిస్తున్నాడని విద్యార్థులు చెబుతున్నారు. లేడీస్ హాస్టల్ వద్ద వాచ్‌మన్‌గా రాత్రి సమయంలో పురుషులను ఏర్పాటు చేస్తున్నారని, తాము వేసుకునే డ్రస్సులపై వెటకారపు మాటలు మాట్లాడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

**ఆందోళన చేసిన విద్యార్థులు**

మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కళాశాల వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళన చేశారు. బస్సు సౌకర్యం పేరుతో విచ్చల విడిగా డబ్బులు వసూలు చేయగా, గతంలో తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. తిరిగి అదే సమస్యను ముందుకు తీసుకొస్తూ ఫీజులు కట్టాలని బెదిరిస్తున్నారని తెలిపారు. మంచినీటి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గొంతు నొప్పి, విషజ్వరాలు వస్తున్నాయని, వీటిని పట్టించుకునే పరిస్థితుల్లో ప్రిన్సిపాల్ లేరని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందించారు.

**క్రమశిక్షణతో ఉండాలన్నాను..**

**డాక్టర్ లక్ష్మణ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్**



డీఎంఈ విధించిన నియమ, నిబంధనలు పాటించాలని, కళాశాలలో విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగాలని చెప్పగా.. వారికి నచ్చలేదు. మెడికోలకు రక్షణతో కూడిన జాగ్రత్తలు తెలియపర్చానే తప్ప వారిపై అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించలేదు.

**ప్రాక్టికల్స్ తిప్పలు..**

విద్యార్థులు పాఠ్యాంశ తరగతులు పూర్తయిన అనంతరం ప్రాక్టికల్స్‌కు వెళ్లాలంటే పడుతున్న తిప్పలు వర్ణనాతీతం. కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రాక్టీస్‌కు రావాలంటే సుమారు 10 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లోనే రాకపోకలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. కళాశాల వద్ద వాహనాలు అందుబాటులో ఉండటం లేదని, దీంతో కొద్ది దూరం నడిచి ప్రైవేట్ వాహనాలు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని వారు చెబుతున్నారు. కళాశాల నుంచి నేరుగా ఆస్పత్రికి తీసుకువెళ్లేలా వాహన సౌకర్యం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

## ఎలా చదవాలి...?

- మౌలిక సదుపాయాలు లేవు..
- సరిపడా ఫ్యాకల్టీ లేరు..
- దురుసుగా ప్రవర్తిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి..
- కొత్తగూడెం వైద్య కళాశాల విద్యార్థుల వేదన
- కళాశాల నుంచి ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా..

7



## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

- మిథిలా స్టేడియంలో ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక అధికారి
- ఆన్‌లైన్‌లో బ్రహ్మోత్సవాల టికెట్లు
- శ్రీరామనవమి ఏర్పాట్లపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సమీక్ష

7



## ఆ ఇద్దరు ఎవరు..?

- మావోయిస్టులు హత్య చేశారంటూ ప్రచారం
- పూసుగుప్ప, కొత్తపల్లి అడవుల్లో మృతదేహాలు అంటూ వదంతులు
- అడవుల్లో గాలించిన మీడియా
- కనిపించని ఆనవాళ్లు

7



## ప్రాణం తీసిన వేగం

- ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుకనుంచి ఢీకొట్టిన బైక్
- ఒకరి దుర్మరణం.. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద ఘటన

కల్లూరు, మార్చి 18: శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న వారికి మార్గమధ్యంలో ఆగి ఉన్న టిప్పర్ రూపంలో ప్రమాదం ఎదురైంది. వేగంగా వెళుతున్న బైక్ ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మం జిల్లా కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన కోటమర్తి కాళీబాబు(23)తో పాటుగా ఇనుపనూరి రవితేజ, ఇనుపనూరి చరణ్‌లు వేంసూరు మండలంలోని బీరపల్లి గ్రామానికి బంధువుల శుభాకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి తమ గ్రామానికి వస్తుండగా కల్లూరు ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై ఆగిఉన్న డీసీఎంను వెనుకనుంచి ఢీకొనటంతో కాళీబాబు ముఖంపై తీవ్ర గాయంతో మృతి చెందాడు. రవితేజ, చరణ్‌లు తీవ్రంగా గాయపడగా వెంటనే వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాళీబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. కల్లూరు ఎస్ఐ ఎస్‌కే షాకీర్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మృతి చెందిన కాళీబాబుతో పాటుగా ఇనుపనూరి రవితేజ కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎయిర్‌టెల్ కంపెనీలో కేబుల్ పని చేసేందుకు వెళుతున్నట్లు తెలిసింది, వారిలో చరణ్ ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేశాడు.



మృతుడు కాళీబాబు



నగరంలో తనిఖీల్లో పాల్గొన్న కుటుంబ ఆరోగ్యసంక్షేమ శాఖ అధికారులు

## రెండు ఫెర్టిలిటీ ఆస్పత్రుల సీజ్

- మరో ఐదింటికి నోటీసులు
- ఖమ్మంలో కలకలం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 18: ఖమ్మం నగరంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలపై (ఫెర్టిలిటీ సెంటర్ల) రాష్ట్ర కుటుంబ ఆరోగ్యసంక్షేమ శాఖ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పలు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఎలాంటి అనుమతులు లేని మూడు ఆసుపత్రులను సీజ్ చేశారు. నగరంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలను అధికారులు ఈ దాడుల్లో గుర్తించారు. శ్రీఫెర్టిలిటీ సెంటర్, భారతి ఆసుపత్రులను ఎలాంటి అనుమతులు, సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన తనిఖీ బృందం వాటిని సీజ్ చేసింది. సరైన వసతులు లేకపోవడంతో లావణ్య, ప్రవీణ, జోయా, మాతృశ్రీ, బిలీఫ్ ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులందించారు.

# నివురుగప్పిన నిప్పులా...

- ఆందోళనకు సిద్ధమవుతున్న ఓబీ కార్మికులు
- సింగరేణిలో కనీస వేతనాల కోసం డిమాండ్
- ఒప్పందానికి కంపెనీల యాజమన్యాలు సహకరించాలి
- ఓవర్ బర్డెన్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నేతలు



విధులకు హాజరవుతున్న ఓబీ కార్మికులు

మణుగూరుటౌన్, మార్చి 18: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఓవర్ బర్డెన్(ఓబీ) కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సౌకర్యాల కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు గతంలో ఓబీ కంపెనీలు కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ఏరియాలోని కార్మిక సంఘాలు విడతలవారిగా ఆందోళనలు, విజ్ఞప్తులు, వినతి పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. కార్మికుల సమస్యలపై ఎంతో అవగాహన ఉన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై వత్తిడి తేచ్చేందుకు కొన్ని సంఘాలు ప్రయత్నాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ దిశగా ఇప్పటికే ఏరియాలో సింగరేణి ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందిన ఐఎన్‌టీయూసీ అనుబంధ ఓబీ కార్మికుల సంఘం, ఇఫ్టూ, సీఐటీయూలతో పాటు ఇతర కార్మిక సంఘాలు ముందుకు సాగుతున్నాయి.

గత ఒప్పందాల అమలులో ఓబీ కంపెనీలు విఫలమయ్యాయని, కనీస వేతన చట్టం, సమాన పనికి సమాన వేతనంతో పాటు చట్ట బద్ధగా కార్మికులకు వచ్చే అలవెన్స్‌ల అమలులోను కార్మికులు నష్టపోతున్నారని, శ్రమదోపిడీకి గురవుతున్నారని కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు. ఏరియాలోని ఓబీ కంపెనీలతో గతంలో చేసుకున్న ఒప్పందాల అమలు చేయకపోగా ఈ ఏడాది మార్చి మాసంలో నూతనంగా కార్మిక సంఘాలతో చేసుకోవాల్సి అగ్రిమెంట్‌కు ఏరియాలోని ఓబీ కంపెనీల యాజమాన్యాలు ముందుకు రావడంలేదని కార్మికులు వాపోతున్నారు.

**ఓబీ కార్మికుల డిమాండ్లపై అగ్రిమెంట్ చేయాలి**
**పుచ్చకాయల శంకర్, ఓబీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు**



మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై కంపెనీ యాజమాన్యాలు అగ్రిమెంట్ చేసేందుకు ముందుకు రావాలని ఐఎన్‌టీయూసీ ఓబీ కాంట్రాక్ట్ కార్మికు సంఘం గౌరవ అధ్యక్షుడు పుచ్చకాయల శంకర్ డిమాండ్ చేశారు. 2022, 2024 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ అనుబంధ ఓబీ కాంట్రాక్టర్‌ల సంఘం ఆధ్వర్యంలో రాసుకున్న అగ్రిమెంట్ నేటికీ అమలు కావడంలేదని ఆరోపించారు. 2023 అక్టోబరు 31న కనీస వేతన చట్టం ప్రకారం సింగరేణి యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ అమలు చేసి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మార్చి మొదటి వారంలో కార్మికులతో ఓబీ కంపెనీ యాజమాన్యాలు నూతన అగ్రిమెంట్ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

**కనీస వేతన చట్టాలను అమలు చేయాలి**
**ఆర్. మధుసూదన్‌రెడ్డి, ఇఫ్టూ నాయకుడు**



సింగరేణి ఓబీ కంపెనీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కనీస వేనత చట్టం అమలు ఓబీ కంపెనీలు, సింగరేణి యాజమాన్యం ముందుకు రావడంలేదని విమర్శించారు. సింగరేణి వేతన చట్టం ప్రకారం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్న వేతనాలను అమలు చేయడంలేదని అన్నారు. ఆర్అండ్‌బీ శాఖ జీఓ ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికుడికి రోజుకు రూ.477లు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.557లు, స్కిల్డ్ రూ.671లు, హైస్కిల్డ్ కార్మికులకు రూ.788లు వేతనాలు ఇస్తున్నారన్నారు. నెలకు 26 రోజులు పని కల్పించడంతోపాటు సెలవు దినాలైన ఆదివారం విధులు నిర్వహిస్తే రెట్టింపు వేతనం ఇవ్వాలని అన్నారు. సింగరేణి ఆసుపత్రుల్లో మెడికల్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



విన్నర్ విజేత భద్రాచలం జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

## ముగిసిన రెండు జిల్లాలస్థాయి క్రికెట్ టోర్నీ

కొణిజర్ల, మార్చి18: మండల పరిధిలోని తీగలబంజర గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ టోర్నీలో భద్రాచలం జట్టు విన్నర్‌గా, రన్నరప్‌గా తీగలబంజర ఫ్రెండ్స్ యూత్ క్రీడాకారులు నిలిచారు. సోమవారం విజేతలకు జయవిలాసిని డెవలప్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్స్(జేవీడీ) చైర్మన్ కుంచపు రాంబాబు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడలకు ప్రత్యేకత ఉంటుందని, ఎక్కడెక్కడ నుంచో వచ్చి క్రీడాకారుల పరిచయం అవుతారని, వారి మధ్య స్నేహసంబంధాలు పెరుగుతాయని తెలిపారు. గ్రామంలో క్రీడలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఫ్రెండ్స్‌యూత్ సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మీటూనాయక్, సైదులు, శ్రీను, బద్రు, కమిటీ సభ్యులు జాన్‌పాష, నునావత్ గోపి, పుపావత్ వీరన్న, గోపి, చంద్ర, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వాహనాలకు నెంబర్‌ప్లేట్ తప్పనిసరి

- వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి
- గురువారం నుంచి స్పెషల్ డ్రైవ్
- ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు

ఖమ్మంక్రైం, మార్చి 18: లైసెన్సు, నెంబరు ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు.. నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను వెంటనే గుర్తించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లైసెన్సు లేకుండా వాహనాలు రోడ్డుపై తిరగకుండా చేసేందుకు గురువారం నుంచి ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. సోమవారం తనిఖీలు నిర్వహించగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 50వాహనాలను గుర్తించి సీజ్ చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. వాహన యజమానితోనే నెంబర్ సరిచేయించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వింతశబ్దాలతో తోటి వాహనదారులను భయపెట్టేలా సైలెన్సర్లను అమరుస్తున్న వారిపై చర్యలు కూడా తీసుకుని వాహనాలు సీజ్ చేస్తామన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, లేకుంటే జరిమాన తప్పదన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ రవి, వెంకన్న, సాగర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌బాబు

# ఉపాధి రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవి

పాల్వంచ రూరల్, మార్చి 18: ఉపాధి హామీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి ఎన్. రవి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక(ఓపెన్ ఫోరం) నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీవో రవి మాట్లాడారు. ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణ జాగ్రత్తగా చేయాలని సూచించారు. మస్టర్‌పైన ఎట్టిపరిస్థితుల్లో వైట్నర్లు ఉపయోగించి దిద్దుబాటు చర్యలు చేయకూడదని హెచ్చరించారు. పనులు పూర్తయ్యాక కొలతలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కూలీల పనిదినాలు పూర్తయినప్పటికీ గుర్తించక పోగా, వారు అదనంగా పనులు చేయడంతో వారు డబ్బులు నష్టపోవడం, ఏపీవో, పీవో సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లించడం వంటివి తనిఖీ బృందం సభ్యులు తనిఖీలలో గుర్తించామని సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడించారు.

**రూ.49,865రికవరీకి ఆదేశాలు**

ఎన్నికల కోడ్ ఉన్నందున ఓపెన్ ఫోరం సాదాసీదాగా సాగింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ సంవత్సరం మండలంలో రూ. 6.7 కోట్లు నిధులతో పనులు జరగగా, స్వల్ప స్థాయిలోనే అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. తనిఖీ సభ్యులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారులు రూ.49,865 రికవరీకి ఆదేశించారు. రూ. 9,000 సిబ్బందికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రమణరావు, అసిస్టెంట్ మేనేజర్ విజిలెన్స్ అనూష, అంబులెన్స్ మెన్ నాగ ప్రకాష్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ అధికారి అనిల్ కుమార్, ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, ఏపీవో పోరండ్ల రంగా, ఎంపీవో బి. నారాయణ, ఏపీఎం రాంబాబు, ఎస్ఆర్‌పీ మౌనిక, ఈసీ పుల్లయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.



మస్టర్లలో దిద్దుబాట్లు చూపిస్తున్న తనిఖీ బృందం

## హాస్టల్ నిర్మాణానికి రూ. 10 కోట్లు

పాల్వంచ రూరల్, మార్చి 18: కేంద్ర ప్రభుత్వం బాలికల అభివృద్ధికి నిర్దేశించిన కేంద్ర పథకంలో భాగంగా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బాలికల హాస్టల్ నిర్మాణానికి రూ. 10కోట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ వై. చిన్నప్పయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంత మహిళల ఉన్నత చదువులకు హాస్టల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బాలికల హాస్టల్ కేటాయించినందుకు రీజనల్ డైరెక్టర్, ప్రొఫెసర్ జి. యాదగిరి, జాయింట్ డైరెక్టర్ డి.ఎస్.ఆర్ రాజేంద్ర సింగ్, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాల భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి భద్రాద్రివాసులకు ప్రత్యేక దర్శనం

**వారంలో మూడు రోజులు ఉచితం**

భద్రాచలం, మార్చి 18: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించేందుకు వచ్చే భద్రాద్రివాసులకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రూ.100ప్రత్యేక దర్శనం ఉచితంగా కల్పించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం నుంచి ఈ కార్యక్రమానికి దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. భక్తులు స్థానికతను సూచించే గుర్తింపు పత్రంతో వస్తే రూ.100 క్యూలైన్ ద్వారా స్వామి వారి దర్శనం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశం కేవలం భద్రాచలంలో నివాసం ఉండే స్థానికులకు మాత్రమేనని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఉత్సవాలు, విశేష దినాలు, ప్రముఖులు వచ్చే రోజుల్లో మినహాయించి మిగత సమయాల్లో ఈ అవకాశం భద్రాద్రి వాసులకు కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## 'గృహజ్యోతి' తప్పుల సవరణకు కోడ్ అడ్డంకి

పాల్వంచ టౌన్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గృహజ్యోతి దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా 200 యూనిట్స్ వరకు ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ పంపిణీ ప్రవేశపెట్టింది. ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తుల్లో చాలా వరకు తప్పులుగా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఆన్‌లైన్‌లో తప్పుగా ఎంటర్ చేయడం, దరఖాస్తు సమయంలో సరైన వివరాలు సమర్పించకపోవడంతో జీరో బిల్లులు, రాయితీ గ్యాస్ లభించడం లేదు. దీనికి గాను ప్రభుత్వం తప్పుల సవరణకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసే అవకాశం కల్పించింది. దీంతో తప్పుల వసరణకు మున్సిపల్ కార్యాలయానికి భారీసంఖ్యలో క్యూ కట్టారు. ఇప్పటికి 2,365 దరఖాస్తులు సవరణ దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సవరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ఫలితాల అనంతరం తిరిగి ప్రక్రియ ప్రారంభం కావడంతో లబ్ధిదారులు సుమారు మూడు నెలలు ఎదురుచూడటం తప్పని సరైంది.



అర్బన్ పార్కు వద్ద పోలీసులు

## నీలాద్రి అర్బన్ పార్క్ వద్ద ఉద్రిక్తత


**జెండాల చెట్టు వెనుక మృతదేహం ఖననం**

సత్తుపల్లిరూరల్, మార్చి18:ఎన్నో ఏళ్లుగా ఇక్కడే తమ బంధుమిత్రులను ఖననం చేస్తున్నామని, జెండాల చెట్టు వద్ద పండుగల సందర్భంలో కార్యక్రమాలు నిర్వహించుకుంటామని.. తమకు అడ్డుచెప్పొదంటూ ఓ వర్గం ఆందోళన చేసిన సంఘటన సోమవారం సత్తుపల్లి మునిసిపాలిటీలో చోటుచేసుకుంది. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మహ్మద్ సమీర్ (22) ఆత్మహత్య చేసుకోగా.. అతని మృతదేహాన్ని వేంసూర్ రోడ్‌లోని నీలాద్రి అర్బన్ పార్క్‌లో అంతర్భాగమైన జెండాల చెట్టు వెనుక ఖననం చేసేందుకు బంధుమిత్రులు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో పార్క్‌లోకి రానివ్వకుండా అటవీ శాఖ అధికారులు గేట్‌కు తాళాలు వేసి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ముస్లింలు గేట్ తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించారు. అటవీ అధికారులను అడ్డుకుంటూ ఖనన కార్యక్రమాలు ముగించారు.

**ఆరుగురిపై పీవోఆర్ నమోదు చేస్తాం: స్నేహలత**

పార్క్‌లో విధి నిర్వహణలో ఉన్న తమ అధికారులపై దహన కార్యక్రమానికి వచ్చిన కొందరు అడ్డుకున్నారని, ఆరుగురు వ్యక్తులపై పీవోఆర్ నమోదు చేయనున్నట్లు సత్తుపల్లి అటవీ శాఖ రేంజర్ స్నేహలత వివరణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా పార్క్‌లోకి ప్రవేశించడమే కాకుండా తమ అధికారులను దూషించడం చట్ట రీత్యా నేరమని, ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పార్క్‌లో సేద తీరేందుకు వచ్చే వారికి, వాకర్స్ ఆ ప్రాంతంవైపు వెళ్లాలంటే భయపడుతున్నారని, ఇలాంటి చర్యలు పునరావృతకాకుండా చూడాలని కోరుతున్నట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి మృతి



సురేష్(ఫైల్)

ఏన్కూరు, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో కేసుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శెట్టిపల్లి సురేష్(40) ఆదివారం రాత్రి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కేసుపల్లి గ్రామానికి చెందిన సురేష్ పొలం పని నిమిత్తం రాత్రి 8 గంటల సమయంలో తన పొలానికి వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కల్వర్టు ఢీకొని అక్కిడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సంఘటనా స్థలానికి సోమవారం ఉదయం ఎస్ఐ బాదావత్ రవి సందర్శించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించారు. మృతుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావుకు తమ్ముడి కొడుకు. పార్టీల నాయకులు, స్నేహితులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# విషమ 'పరీక్ష'!

- పరీక్ష రాసి తిరిగి వచ్చేసరికి కన్నుమూసిన తల్లి...
- తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే పరీక్షకు...
- గుండెల్ని బరువెక్కించిన రెండు ఘటనలు
- కొత్తగూడెం, కల్లూరు శ్రీరామపురంలో విషాదం



తల్లి మృతదేహం వద్ద విషణ్ణవదనంతో మహేష్

లక్ష్మీదేవిపల్లి/కల్లూరు, మార్చి 18: ఒక వైపు మృత్యువుతో పోరాడుతున్న తల్లి.. మరో వైపు తన భవిష్యత్‌కు తొలిమెట్టు అయిన పదో తరగతి పరీక్షలు ఓ విద్యార్థిని సంకట స్థితిలోకి నెట్టాయి. అయితే కన్నీళ్లను దిగమింగి పరీక్షకు వెళ్లిన ఆ విద్యార్థి తిరిగి వచ్చేసరికే అతడి తల్లి కన్నుమసింది. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని ప్రగతినగర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్‌లో నోముల సదానందం, రమాదేవి(38) దంపతులు టైలరింగ్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. అయితే రమాదేవి గత కొంతకాలంగా గుండె సంబంధవ్యాధితో బాధపడుతూ కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలోనే ఆమె చిన్న కుమారుడు మహేష్‌కు సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మరోవైపు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి తల్లి ఆరోగ్య పరిస్థితి విషమించింది. అయినా అతడు ఆ బాధను దిగమింగి పరీక్షకు హాజరయ్యాడు. కానీ పరీక్ష రాసి వచ్చేసరికే అతడి తల్లి కన్నుమూసింది. పరీక్ష రాసి బయటకు వచ్చిన మహేష్ తన తల్లి ఇక లేదనే వార్త విని గుండెలు పగిలేలా ఏడ్చాడు. తల్లికి అంతిమసంస్కారాలు చేయాల్సి ఉండడంతో మహేష్ తదుపరి పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అతడి పరిస్థితిని గమనించి ప్రత్యేక తేదీల్లో పరీక్షలు నిర్వహించాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.



తండ్రి మృతదేహం వద్ద దిగాలుగా ఉన్న అఖిల్

**తండ్రి మృతి బాధతోనే...**

తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. ఖమ్మం జిల్లా కల్లూరు మేజర్ పంచాయతీ పరిధిలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన మారబోయిన అఖిల్ పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభమవుతుండగా ఆదివారం సాయంత్రం అతడి తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అదే రోజు అఖిల్ పుట్టినరోజు కూడా కావడం గమనార్హం.. అయితే తండ్రి అంతిమక్రియలు ముగియకముందే సోమవారం ఉదయం పరీక్షకు హాజరైన అఖిల్ పరీక్ష ముగించుకొని వచ్చిన తరువాత మధ్యాహ్నం తండ్రి గోపాలకృష్ణ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నాడు. అఖిల్ తండ్రి గోపాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఏడాది జరిగిన ప్రమాదంలో గోపాలకృష్ణ తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లి ఆదిలక్ష్మి కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

# కన్న తండ్రే కడతేర్చాడు..

**భూమి అమ్మిన డబ్బుల కోసం వివాదం ▸ పోలీసుల ముందు అంగీకరించిన తండ్రి**

మణుగూరుటౌన్, మార్చి 18 : మణుగూరు మండల పరిధిలోని తిర్లాపురం పంచాయతీ బెస్తగూడేనికి చెందిన మునిగెల నరేష్‌ది అనుమానాస్పద మృతి కాదు హత్యేనని పోలీసులు తేల్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామానికి చెందిన మునిగెల నరేష్‌కు భార్య వరలక్ష్మి, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కూలి పనులు చేసుకుని జీవించే నరేష్ మందుకు బానిసై భార్యను హింసించేవాడు. దీంతో నరేష్ ప్రవర్తనపై విసిగిపోయిన భార్య వరలక్ష్మి రెండేళ్ల క్రితం పినపాక మండలం రాయిగూడెంలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి అక్కడే ఉంటోంది. ఇటీవల తండ్రి భూమి అమ్మగా వచ్చిన డబ్బులకోసం నరేష్ తరచూ తండ్రి గోపయ్యతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో శనివారం రాత్రి తన ఇంటికి వంద మీటర్ల దూరంలోని తండ్రి గోపయ్య ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో ఈ పెనుగులాటలో నరేష్ చొక్క చినిగి ఒంటిపై గీసుకుపోయి గాయాలవుతాయి. దీంతో రెచ్చిపోయిన నరేష్ తన తండ్రిని చంపుతానంటూ మీదకు వెళ్లాడు. తండ్రి గోపయ్య కొడుకు నరేష్‌ను తోయడంతో మద్యం మత్తులో ఉన్న నరేష్ కిందపడిపోయాడు. వెంటనే విసిగిపోయిన తండ్రి గోపయ్య చినిగిపోయిన చొక్కతో మెడను బిగించి పట్టుకోవడంతో నరేష్ మృతి చెందాడు. చనిపోయిన కొడుకును తీసుకెళ్లి నరేష్ ఇంట్లో పడుకోబెట్టి తిరిగి వచ్చాడు.

ఆదివారం ఉదయం తన భర్త నరేష్ మృతి చెందిన వార్త విని ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి మార్చురీలో ఉన్న నరేష్ మృతదేహాన్ని చూసి, మెడ చుట్టూ నల్లగా కమిలిపోయి ఉండడం, భర్త పొట్టభాగంలో గీరకపోయి ఉండడాన్ని చూసి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి. అనుమానితుడైన గోపయ్యను తీసుకుని సీఐ సతీష్‌కుమార్ అదుపులోకి విచారించగా నేరం అంగీకరించాడు. డబ్బుల కోసం తరుచు కొట్టి వేధిస్తుండేవాడని, ఆ క్రమంలోనే ఘటన జరిగినట్టు నేరం అంగీకరించాడు. పోలీసులు చిరిగిపోయిన చొక్కాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

చింతకాని, మార్చి 18: ఖమ్మం- విజయవాడ రైలు మార్గంలో చింతకాని మండలం అనంతసాగర్ సమీపంలో మల్లెల కుటుంబరావు (30) అనే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడేనికి చెందిన కుటుంబరావు కొంతకాలంగా అత్తగారి గ్రామమైన అనంతసాగర్‌లో నివసిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఓ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, అతని బృందం శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ పారుపల్లి భాస్కర్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అరవై లీటర్ల నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం మార్చి 18: సుజ్ఞానపురానికి చెందిన అజ్మీరా రవి సోమవారం రూ.24వేల విలువైన అరవై లీటర్ల నాటుసారాతో పోలీసులకు పట్టుబడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రకుమార్ సిబ్బందితో కలిసి ఆర్లగూడెం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తూ దొరికాడు. నిందితుడితోపాటు నాటుసారా, ద్విచక్రవాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గనికి వెళ్తున్న కారు బోల్తా..

- పలువురు కార్మికులకు స్వల్ప గాయాలు
- క్వార్టర్ కేటాయిస్తామన్న వినడం లేదు : డీజీఎం పర్సనల్ రమేష్



బోల్తా పడిన కారు

మణుగూరుటౌన్, మార్చి 18: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం గనికి సంబంధించిన కార్మికులు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మణుగూరు ఏరియాలోని కొండాపురం గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు సోమవారం కారులో విధులకు వెళ్తుండగా.. అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఏరియా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**క్వార్టర్లు కేటాయిస్తామన్నా వినడంలేదు- డీజీఎం పర్సనల్ రమేష్**

ఇతర ఏరియాల నుంచి బదిలీపై మణుగూరు ఏరియాకు వచ్చిన కార్మికులకు క్వార్టర్లు కేటాయిస్తామన్నా వినడంలేదని డీజీఎం పర్సనల్ రమేష్ అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వివిధ ఏరియాల నుంచి వచ్చిన కార్మికులు రోజు ప్రైవేటు వాహనాల్లో విధులకు హాజరవుతున్నారని, ఎంత హెచ్చరించినా వినడంలేదన్నారు. గని మార్గంలో దుమ్మును నివారణకు నీటిని స్ప్రే చేయడం వల్ల ఆ తడికి వాహనం జారి పడిపోయిందని, ఈ ఘటనలో కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని ఆయన తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**పట్టుబడిన ఐదుగురిలో ఓ కానిస్టేబుల్**

బూర్గంపాడు, మార్చి 18: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టుబడిన వారిలో ఓ కానిస్టేబుల్ సైతం ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలోని కండక్టర్స్ కాలనీలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి సమయంలో ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా.. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.22,260లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టపడిన వారిలో ఎస్బీలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. దాడుల్లో అదనపు ఎస్ఐ నాగభిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయం చేయాలంటూ మృతుడి బంధువుల ఆందోళన



ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబసభ్యులు

అశ్వాపురం మార్చి 18: తమ కుమారుడి మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు సోమవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఐలపొంగు జగదీష్(19) ప్రేమ విఫలం కావటంతో మనస్థాపం చెంది ఈనెల 15న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో జగదీష్ మృతికి కారకులైన వారిని అరెస్ట్ చేయాలంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళనను విరమించారు.



## కాంగ్రెస్‌లో కార్పొరేషన్ చైర్మన్..
# పదవుల చిచ్చు

**తుమ్మల, రేణుక వర్గీయులకు దక్కని అవకాశం**

ఖమ్మం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం నియమించిన కార్పొరేషన్ పదవుల నియామకం అధికార కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. జిల్లాలో నాలుగు వర్గాలుగా నడుస్తున్న కాంగ్రెస్ వర్గ రాజకీయాలలో అంతర్గత పోరు సాగుతోంది. జిల్లాకు వచ్చిన కార్పొరేషన్ చైర్మన్ పదవుల విషయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులకు దక్కిన విషయం తెలిసిందే.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికైన కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి వర్గీయులకు చైర్మన్ పదవులు దక్కలేదు. ఈ ఇద్దరి నేతల అనుచరులు అసెంబ్లీ టికెట్లు ఆశావహులు పలువురు చైర్మన్ పదవులు దక్కుతాయని ఆశతో ఉన్నారు. రేణుకాచౌదరి వర్గీయులు సోమవారం హైదరాబాదులో రేణుకాచౌదరిని కలిసి సమావేశం కావాలని నిర్ణయించి ఆ తర్వాత వాయిదా వేశారు. జిల్లాలో చైర్మన్ పదవుల కేటాయింపు విషయంలో జరిగిన అన్యాయాన్ని అధిష్ఠానం దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లబోతున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు కోడ్ అమల్లో ఉన్నందున కొత్త గా చైర్మన్ పదవుల నియామకాలు జరిగే పరిస్థితి లేకపోవడంతో.. .అసంతృప్తిని బహిరంగ పరచకుండా అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల ఆశావహులకు, పార్టీలో సీనియర్లకు చైర్మన్ పదవులు, ఇతర ప్రభుత్వ నియామక పదవుల్లో న్యాయం చేయాలని రేణుకా వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలి

- లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- అభ్యర్థుల ఖర్చు పరిమితి రూ.95లక్షలు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా న ఇర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి భద్రాద్రి జిల్లాలోనూ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోటీలో ఉండే అభ్యర్థి రూ.95లక్షల వరకు ఖర్చు పెట్టుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బయట తిరిగే ప్రజలు తమ వెంట రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లడానికి వీల్లేదని తెలిపారు. రూ.50వేలకు మించి నగదు పట్టుబడితే ఆ డబ్బులను సీజ్ చేసి త్రీమెన్ కమిటీకి పంపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అనుమతులు లేకుండ సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘులు, నగదు పంపిణీ, ఘర్షణలు, సభలు, సమావేశాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడిన సీవిజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం కింద కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు వస్తాయని, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కింద పినపాక, ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాలు వస్తాయన్నారు. అన్ని నియోజకవర్గాలకు అయా నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1095 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని మొత్తం జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు కలిపి ఓటర్లు 9,84,629మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కోసం కొన్ని బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, పినపాక ఎఆర్‌వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతిక్ జైన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజు

## డీఎంహెచ్‌వోగా మాలతి బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి18: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి. మాలతి సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఆమె సెలవులో ఉన్నారు. గత 49 రోజుల క్రితం మధిరలో పల్లెదవాఖానా ప్రారంభోత్సవంలో కాలికి దెబ్బ తగలడంతో ఆమె సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి తొలుత డాక్టర్ రామునాయక్ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూడా వ్యక్తిగత కారణాలతో వెళ్లడంతో జిల్లా టీబీ అధికారి డాక్టర్ వి. సుబ్బారావుకు డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో తిరిగి డాక్టర్ మాలతి సోమవారం విధుల్లో చేరారు. ఆ తర్వాత ఆమె కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఖమ్మం బార్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

ఖమ్మం లీగల్, మార్చి18: 2024-25 సంవత్సరానికి జరుగుతున్న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. మొదటిరోజున అధ్యక్ష పదవికి 2 నామినేషన్లు, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి పోస్టులకు ఒక్కొక్క నామినేషన్లు దాఖలు అయ్యాయి. అధ్యక్ష పదవికి చిలుకూరి స్వర్ణకుమారి, నేరెళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష పదవికి కె.ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పదవికి కాండే వెంకటేశ్వరరావు, కోశాధికారి పదవికి ఇజ్జగాని శ్రీనివాసరావు లు నామినేషన్లు దాఖలు చేశారని బార్ ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు.



# పింఛన్ బాంచెన్ !

- పండుటాకుల దరఖాస్తులకు మోక్షం లేదు
- రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వృద్ధులు

మధిర, మార్చి 18: రెండు సంవత్సరాలుగా పింఛన్లకోసం ఎదురుచూస్తున్న వేలాది మంది వృద్ధులకు ఇప్పట్లో మంజూరయ్యే సూచనలు కనిపించడంలేదు. ఎన్నికల ముందు మంజూరవుతాయనుకుంటే నిరాశే. మిగిలింది. ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని విచారించి వివరాలను ఆన్‌లైన్ చేసే అవకాశం లేకుండా పోయింది. అప్పటి ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపి వేయడంతో ఆన్‌లైన్ ప్రక్రియ ఆగింది. దాంతో కొత్త పింఛన్ల మాటే లేకుండా పోయింది. ప్రభుత్వం 57 సంవత్సరాలు నిండిన వారికే వృద్ధాప్య ఫించన్ అనడంతో ఎంతో మంది దరఖాస్తుచేసుకొని ఆశగా ఎదురుచూస్తున్నారు.

**కొత్త ప్రభుత్వంలోనూ అడియాశలే..**

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తుందని ఆశపడ్డారు. 57సంవత్సరాలు నిండిన వారంతా దరకాస్తు చేసుకోవాలనడంతో ప్రజాపాలన సభలో వేలాది మంది వృద్ధులు దరఖాస్తుచేసుకున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తుందని సంబరపడ్డారు. అందరిలోనూ ఆశలు చిగురించాయి. అంతలోనే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి వీరి ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో మరో మూడు నెలల వరకు కొత్త పించన్లకు ఆస్కారం లేదు.

**ఫించన్ల పెంపు ఎప్పుడో..**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వృద్ధాప్య పింఛన్ రూ.2వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని ఎన్నికల హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా కొత్త పింఛన్లు లేకున్నా ప్రస్తుత ఉన్న పింఛన్‌ల పెంపు విషయం ప్రస్తావనేలేకుండా ఉంది. తమ పింఛన్లు పెరుగుతాయని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం పింఛన్ల పెంపు పట్ల ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పింఛనుదారుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్ల పెంపు విషయమై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.

**ఖమ్మం జిల్లాలో...**

అధికారుల లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం మొత్తం 1,90,330 మంది పింఛన్ దారులు ఉన్నారు. వీరిలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారు 73,369 మంది ఉన్నారు. వితంతువులు 10,684 మంది, వికలాంగులు 28,670 మంది. మిగిలిన వారు ఇతర పింఛన్‌లు పొందుతున్నారు. కొత్తగా పింఛన్‌లో కోసం ధరఖాస్తులు 60వేల వరకు వచ్చాయి. ప్రస్తుతం నెలవారీగా రూ.43.99కోట్లు వరకు ఖర్చు అవుతుంది.

## ఇసుక కోసం ఆన్‌లైన్ విధానం..

- ప్రత్యేక పోర్టల్‌లో బుకింగ్ సదుపాయం
- సుజాతనగర్ తహసీల్దార్ శిరీష



సుజాతనగర్, మార్చి 18: 'మన ఇసుక - మన వాహనం' ను సద్వినియోగం చేసుకోవాలని సుజాతనగర్ తహసీల్దార్ శిరీష కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18 ఇసుక రీచ్‌లను అధికారికంగా కలెక్టర్ ప్రకటించారని తెలిపారు. 'మన ఇసుక - మన వాహనం' ద్వారా ఇసుకను పొందటానికి ప్రభుత్వ రీచ్‌ల ద్వారా యాప్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. దీనికోసం https://tsmiv.cgg.gov.in/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇసుక వాహనం యాప్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. పాల్వంచలో 4, లక్ష్మీదేవిపల్లి మండలంలో 2 ఇసుక ర్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దూరాన్ని బట్టి రేటు ఉంటుందని, ఇసుక బుక్ చేసినప్పుడే రేటు తెలుస్తుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య మాత్రమే ఇసుకను బుకింగ్ చేసుకోవాలన్నారు. మండలంలోని ఎదుళ్లవాగు దగ్గర నుంచి ఇసుక రాత్రిళ్లు అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసిందని, దొరికితే బైండోవర్ కేసులు నమోదు చేసి, లక్ష రూపాయల దాకా జరిమానా విధిస్తామని తెలిపారు. రాఘవాపురం వద్ద ఇసుక డంప్‌ను త్వరలో పరిశీలిస్తామని, మైనింగ్ అధికారులతో మాట్లాడి ఇసుక రీచ్‌ల ఏర్పాటు అంశం పరిశీలిస్తామని తెలిపారు. త్వరలోనే అక్రమ ఇసుక రవాణా వాహనాలను గుర్తించి బైండోవర్ చేస్తానని స్థానిక ఎస్సై హామీ ఇచ్చారని, అక్రమంగా వాగు నుండి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 'పది'లో మంచి మార్కులు సాధించాలి

- ఎంజేపీ ఆర్‌సీవో అంజలి

మధిరరూరల్, మార్చి 18: పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఎటువంటి ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని మహాత్మాగాంధీ జ్యోతిరావ్‌పూలే బీసీ విద్యా సంస్థల రీజినల్ కోఆర్డినేటర్ అంజలి అన్నారు. పది పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన మొదటి ముగ్గురికి టీజీపీఏ తరఫున ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. మధిర మండలం కృష్ణాపురం వద్దగల మహాత్మాగాంధీ జ్యోతిరావ్‌పూలే బీసీ గురుకుల పాఠశాలను సోమవారం ఆర్‌సీవో అంజలి సందర్శించారు. ఈ పాఠశాలలో గత రెండురోజులుగా మోటారు చెడిపోయి విద్యార్థులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఆర్‌సీవో సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడున్న సమస్యలపై పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ కోట లోకేష్, జిల్లా అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు అక్కడకు చేరుకొని పాఠశాలలోని సమస్యలను ఆర్‌సీవో దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే గురుకుల పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

- శ్రీరామనవమి ఏర్పాట్లపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సమీక్ష

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 18: భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు. కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం భద్రాచలం శ్రీరామనవమి, మహాపట్టాభిషేక ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలంలో శ్రీరామనవమి రోజు స్వామివారి కళ్యాణం నిర్వహించే మిథిలా స్టేడియాన్ని 26సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌లోకి వెళ్లకుండా పటిష్ఠ బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఆన్‌లైన్‌లో వసతి(లాడ్జి) బుక్ చేసుకొనేలా సౌకర్యం కల్పించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా నవమి ఉత్సవాల టికెట్లు విక్రయాలు చేపట్టాలన్నారు. మహోత్సవాల రోజుల్లో భద్రాచలంలో మాంసం, మద్యం విక్రయాలను నిలిపేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యాక్రమాలను పర్యవేక్షించేందుకు భద్రాచలం పట్టణాన్ని 25జోన్‌లుగా విభజించి, ప్రతిజోన్‌కు ఒక ఎంపీవోతో పాటు, నలుగురు పంచాయతీ కార్యదర్శులను నియమించామన్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో ఉత్సవాల రోజుల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రతిసెక్టార్‌కు తాగునీటి సరఫరాకు ఏఈలను నియమించాలని మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లోనే భక్తులు వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ఠ బారికేడింగ్ ఏర్పాటుతో పాటు నాటు పడవలను, గజఈతగాళ్లను సిద్దంగా ఉంచాలన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు మూడంచల భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, దేవస్థాన ఈఓ రమాదేవి, డీఆర్‌ఓ రవీంద్రనాద్, ఆర్డీవో మధు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల మధ్య ఎలా చదవాలి ?

- మౌలిక సదుపాయాలు లేవు..
- సరిపడా ఫ్యాకల్టీ లేరు..
- దురుసుగా ప్రవర్తిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి..
- కొత్తగూడెం ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థుల వేదన
- కళాశాల నుంచి ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థినిల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైద్య విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరితే ప్రిన్సిపాల్ తమపై దురుసుగా వ్యవహరిస్తున్నారని, సమస్యలను అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపించారు.

తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పాలని సుమారు రెండు కిలోమీటర్ల మేర మండుటెండలో ర్యాలీగా కలెక్టరేట్ చేరుకొని ధర్నా నిర్వహించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు లేవని, పరికరాల కొరతతో పాటు, ఫ్యాకల్టీ లేరని తెలిపారు. బాలికల హాస్టల్‌లోకి అటెండర్ నుంచి ప్రిన్సిపాల్ స్థాయి వరకు వచ్చి ఆడపిల్లల డ్రెస్‌కోడ్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకే రోడ్డెక్కామని వివరించారు. తమ గోడును కలెక్టర్‌కు వినిపించేందుకు అవకాశం కల్పించాలని కోరగా, పాల్వంచ సీఐ వారిని కలెక్టర్ వద్దకు పంపించారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో మీడియా ప్రతినిధులు మెడికల్ కళాశాలను సందర్శించేందుకు ప్రయత్నించగా, ప్రిన్సిపాల్ లోనికి నిరాకరించారు.

**సమస్యలు పరిష్కరించాలి...**

కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెస్ బిల్లుల్లో అవినీతి చోటుచేసుకుందని, ఫండ్స్ దుర్వినియోగం అవుతున్నాయని, విద్యార్థినిల పట్ల ప్రిన్సిపల్ దురుసుగా మాట్లాడుతున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. విద్యార్థుల నిరసనకు వారు సంఘీభావం తెలిపారు. కళాశాల ఏర్పాటు చేసి ఏడాది పూర్తవుతున్నా.. కనీస మౌలిక వసతులు లేవని, విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాలు లేవని, అడిగిన విద్యార్థులను ప్రిన్సిపల్ టార్గెట్‌చేసి వేధిస్తున్నారని, బస్సు సౌకర్యం పేరుతో విచ్చల విడిగా డబ్బులు వసూలుచేస్తున్నారని ఆరోపించారు. నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులపై పెత్తనం చలాయిస్తున్నారని, విద్యార్థినిల హాస్టల్‌కు వాచ్‌పర్సన్‌లుగా పురుషులను పంపుతున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ చేసి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



రేణుకా చౌదరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మువ్వా



యాదాద్రి దేవాలయంలో పూజలు చేస్తున్న రాయల

## మంత్రి ఉత్తమ్‌ను కలిసిన మువ్వా

సత్తుపల్లి, మార్చి18: రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మువ్వా విజయబాబు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

**యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..**

ఖమ్మం సంక్షేమవిభాగం: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు జరిపారు.

## సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన

ఖమ్మం రూరల్, మార్చి 18: మండల పరిధిలోని పెద్దతండా గ్రామపంచాయతీలో టెంపుల్ సిటీలో సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్థానికులు ఆందోళన చేశారు. సెల్ టవర్ నిర్మించే ఇంటి ఎదుట బైఠాయించారు. కాలనీలో దాదాపుగా 200 కుటుంబాలు నివాసముంటున్నామని, సెల్ టవర్ నుంచి వచ్చే రేడియేషన్ ప్రభావంవల్ల కాలనీలోని ప్రజలు ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ అధికారికి, పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. సెల్ టవర్ నిర్మాణం నిలిపివేసే వరకు ఆందోళన చేస్తామని తేల్చిచెప్పారు. కాలనీలోని చిన్నారులు, వృద్ధులు, మహిళలు, పురుషులు అందరూ ఆందోళనలో పాల్గొన్నారు.

## మూడు ఇసుక లారీల పట్టివేత

కామేపల్లి, మార్చి 18: అధిక లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలను కామేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి కామేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం లారీలపై కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు.

# గొత్తికోయల గూడు పాయే

- సిమెంట్ గోడల ఇళ్లను కూల్చిన అటవీ అధికారులు
- పక్కా నిర్మాణాలకు అభ్యంతరం..



ఇళ్లు కూల్చారని వాపోతున్న ఆదివాసీలు

ఆళ్లపల్లి, మార్చి 18: వలస ఆదివాసీలు నిర్మించుకుంటున్న సిమెంట్ గోడల ఇళ్లను అటవీశాఖ అధికారులు కూల్చివేసి, నిర్మాణాలను అడ్డుకున్న సంఘటన ఆళ్లపల్లి మండల, బూసురాయి గ్రామంలో సోమవారం జరిగింది. ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల్లోని కొందరు గొత్తికోయలు కొన్ని సంవత్సరాల క్రితం నుంచి ఆళ్లపల్లి మండల, బుసురాయిలో జీవిస్తున్నారు. జీవిస్తు, ప్రభుత్వ పథకాలు, ఇతర సదుపాయాలు పొందుతూ, గడ్డి, మట్టి గోడలతో ఇళ్లను నిర్మించుకుని ఉంటున్నారు. వర్షకాలంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వారం రోజుల నుంచి సిమెంట్ ఇటుకలతో ఇళ్లను కట్టుకుంటున్నారు. అయితే ఆ ప్రాంతం వైల్డ్‌లైఫ్ అభయారణ్యంలో ఉందని, అటవీ అధికారులు నిర్మాణాలకు అడ్డుకుంటున్నారు. మట్టి, గడ్డిపై కప్పు ఇళ్లలో ఉంటే తమకు అభ్యంతరం లేదని చెబుతున్నారు. ఈ విషయం పై సీపీఐ జిల్లా నాయకుడు, ఆళ్లపల్లి వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ఖండించారు. ప్రభుత్వం ఒక పక్క ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీలు ఇస్తుంటే.. అటవీశాఖ అధికారులు ఇళ్లు కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని, ఇళకలను కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆ ఇద్దరు ఎవరు..?

- మావోయిస్టులు హతమార్చారంటూ ప్రచారం
- అడవుల్లో మృతదేహాలున్నాయని వదంతులు
- గాలించిన మీడియా.. కనిపించని ఆనవాళ్లు

చర్ల, మార్చి 18: చర్ల మండలంలో సోమవారం ఉదయం నుంచి ఓ వార్త పోలీసులను కవలర పెట్టించగా, మీడియాను పరుగులు పెట్టించింది. మండలంలోని పూసుగుప్ప, కొత్తపల్లి అడవుల్లో ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు హత్యచేసి పడేశారని, వారికి తలలు కూడా లేవని ఆ వార్త సారాంశం. దీంతో వాస్తవాలు తెలుసుకునేందుకు సోమవారం మధ్యాహ్నం అడవుల్లో మీడియా వెతుకులాట ప్రారంభించగా ఎలాంటి అనవాళ్లు కనిపించలేదు.

కాగా పోలీసులు మాత్రం వదంతులను కొట్టి పారేయడం లేదు. చర్ల మండలంతో పాటు ఇతర మండలాల వారు, చర్ల మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే క్రమంలో రెండు ట్రాక్టర్లపై చర్ల మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళుతున్న ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు పట్టుకుని పూసుగుప్ప, కొత్తపల్లి అడవుల్లో హత్య చేశారని పుకార్లు రేగాయి. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. మీడియా కూడా అసలు చనిపోయింది, ఎవరు, ఎక్కడి వారు అని తెలుసుకునే ప్రయత్నం చేసింది. చర్ల, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగ్పు అడవుల మీదుగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లోకి చేరుకుంది. ఇదే క్రమంలో పాత్రికేయులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. అడవుల్లో ఎక్కడ చూసినా నరికిన చెట్లు, కందకాలు తవ్విన దృశ్యాలు కనిపించాయి.

పూసుగుప్ప, కొత్తపల్లి అడవుల్లో కొన్ని చోట్ల భారీ టేకు చెట్లను మిషన్‌లతో కోసిన దృశ్యాలు కనిపించారు. ఒక్కో చెట్టుకు 40 నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు కనిపించింది. కానీ ఎలాంటి మృతదేహాలు కనిపించలేదు. ఇదే క్రమంలో అడవుల్లోకి వెళ్లిన మీడియాకు తారసపడిన కొంత మంది గిరిజనులు తమకు కూడా ఇద్దరిని చంపేసినట్లు తెలిసిందని, కానీ ఎవరనేది తెలియదని పేర్కొన్నారు. మరొకరు టేకు చెట్లు నరకిన వారిని హతమార్చారని అనుకుంటుంటే విన్నామని, కానీ ఎంత వరకు వాస్తవమో తెలియదన్నారు. సమాచారం తెలియకపోవడంతో తిరుగు ప్రయాణమైన విలేకరులు సోమవారం సాయంత్రం చర్లకు చేరుకున్నారు. దీనిపై చర్ల పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**చెట్లు నరికి, కందకాలు తవ్వి..**

చర్ల మండలం పూసుగుప్ప గ్రామం తర్వాత, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ అడవులు వస్తాయి. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి మావోయిస్టులు వందల చెట్లను నరికేశారు. ఆపై వందల సంఖ్యలో రోడ్లకు అడ్డంగా కందకాలు తవ్వారు. రాక పోకలు సాగించడానికి గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు ఏర్పాటు చేస్తున్న బేస్ క్యాంపులకు నిరసనగా మావోయిస్టులు కందకాలు తవ్వినట్లు తెలుస్తోంది. కొత్తపల్లి, భీమారం పాడు గ్రామం నుంచి పూజారి కాంకేర్, గలగం గ్రామాలు వరకు, సుమారు 25 కిలోమీటర్ల మేర చెట్లు నరికి కందకాలు తవ్వినట్లు వాహనదారులు చెబుతున్నారు. 20 రోజుల కిత్రం మావోయిస్టులు ఈ ఘటనలకు పాల్పడ్డట్లు తెలుస్తోంది.





ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తవ్విన కందకాలు

## శివరాత్రి ఆదాయం రూ.3.07లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మణుగూరు, మార్చి 18: మణుగూరులోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాస్థనంలో శివరాత్రి సందర్భంగా టిక్కెట్ దర్శనం ద్వారా రూ.1,21,650 కొబ్బరికాయల వేలం ద్వారా 21,500, హుండిలో భక్తులు సమర్పించిన కానుకలు 1,29,945 , కళ్యాణ కట్నాల ద్వారా 11,945, షాపుల ద్వారా 18 వేలు, కళ్యాణ టిక్కెట్ ద్వారా 4,464 రూపాయాలు వచ్చాయని మొత్తం మీద రూ. 3,07,504 ఆదాయం సమకూరిందని ఈవో జీ సుదర్శన్, పోరిక బేల్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామచంద్రమూర్తి, స్థానిక రైతులు లాలయ్య, కూచిపూడిబాబు, పర్స సత్యనారాయణ, ఆలయ గుమస్తా శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# మొదటిరోజు 'పది' పరీక్షలు ప్రశాంతం

» అధికారుల తనిఖీలు » విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు

జూలూరుపాడు,మార్చి18: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం జూలూరుపాడులో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు గాను రెండు కేంద్రాల పరిధిలో 326 మంది విద్యార్థులు హాజరు కావల్సి వుంది. కాగా 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రత్యేకవసరాలకు చెందిన ఒక విద్యార్థిని(దివ్యాంగురాలు)కు ప్రభుత్వం తెలుగు పరీక్షకు మినహాయింపు ఇచ్చినట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ తెలిపారు. దీంతో 326 మంది విదార్థులు హాజరయ్యినట్లేనని ఆయన తెలిపారు. తొలి రోజు పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ స్వాతిబిందు, జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనరెడ్డి, ఎస్సై జీవన్‌రాజులు సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

● అశ్వారావుపేట రూరల్/టౌన్: మండల వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 593మందికి 589 మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను ఎస్ఐ శ్రీరాముల శ్రీను సందర్శించారు.

●బూర్గంపాడు: మండలంలో నాలుగు కేంద్రాల్లో మొత్తం 612మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హజరవడంతో మంది విద్యార్థులు 609మంది హాజరయ్యారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్షహాలులోకి అనుమతించారు.

●చంద్రుగొండ: మండలంలోని 286 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరైయ్యారు. వారిలో నలుగురు విద్యార్థులు పరిక్షలకు గైర్హాజరైయ్యారు. ఉమ్మడి జిల్లాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ పరిక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.స్థానిక తహసీల్దార్ సంధ్యారాణి పరిక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

●అన్నపురెడ్డిపల్లి: మండలంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 93మందికి గాను 92మంది పరిక్షకు హజరుకాగా ఒకరు గైర్హాజరైయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 156 మందికి అందరు హాజరైయ్యారు.

●అశ్వాపురం: మండలంలో మొదటి రోజు మల్లెలమడుగు పరీక్షా కేంద్రంలో మొత్తం 110 మంది విద్యార్థులకు 108 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అశ్వాపురం పరీక్షా కేంద్రంలో 105 మంది విద్యార్థులకు నూరు శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంఈవో వీరస్వామి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

●టేకులపల్లి: టేకులపల్లి మండలంలో టేకులపల్లి పరీక్ష కేంద్రంలో 180మంది విద్యార్థులకుగాను 180మంది విద్యార్థులు, బోడు పరీక్ష కేంద్రంలో 68మంది విద్యార్థులకు గాను 68మంది విద్యార్థులు, సులానగర్ పరీక్ష కేంద్రంలో 194మంది విద్యార్థులకు గాను 193మంది విద్యార్థులు హాజరయ్యారు.

●మణుగూరు: మండలంలోని 849 మంది విద్యార్థులు ఐదు సెంటర్ల హాజరు కావల్సి ఉండగా పివీ కాలనీ స్కూల్‌లో ఒక్క విద్యార్థి మాత్రమే గైర్హజరు అయ్యారు. 848 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఎంఈవో వీరాస్వామి, మండల తహసీల్దార్ రాఘవరెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐలు లీలావతి, శ్రీనివాస్‌లు మండలంలోని మిగతా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.


జూలూరుపాడులో విద్యార్థినులను తనిఖీ చేస్తున్న దృశ్యం

●చుంచుపల్లి: చుంచుపల్లి మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈవో జుంకీలాల్ సోమవారం తెలిపారు. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలలో మొత్తం 789 మందికి హాల్ టిక్కెట్లు మంజూరు అవ్వగా వంద శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

●పినపాక: పదోతరగతి వార్షిక పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా మొదలయ్యాయి. 369 మంది విద్యార్థులకు 367 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాయగా, ఇద్దరు విద్యార్థులు తొలి రోజు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ వీరాస్వామి వివరాలు వెల్లడించారు.

●సుజాతనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి పరీక్షకు 195 మంది విద్యార్థులకు గాను 194 మంది విద్యార్థులు హాజరయినారని ఒకే ఒక్కరు గైర్హాజరయినారని అధికారులు తెలిపారు.

●కరకగూడెం : కరకగూడెం మండలంలో 88 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో వీరస్వామి, తహసీల్దార్ నాగ ప్రసాద్, సీఐ కరుణాకర్, ఎస్ఐ రాజేందర్ సందర్శించారు.

### ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు

●దుమ్ముగూడెం: నరసాపురం, కె రేగుబల్లి పదోతరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. కొత్తపల్లి కేంద్రంలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరవగా, మిగతా కేంద్రాల్లో పూర్తి శాతం హాజరయ్యారు. మొదటిరోజున ప్రశాంతంగా జరిగాయి.

పాల్వంచ రూరల్: మండలంలో 9 పరీక్షా కేంద్రాలు నిర్వహించగా 1916 మంది విద్యార్థులకు గాను 1911 మంది విద్యార్థులు హాజరవగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. ఎంఈవో శ్రీరామ్మూర్తి పరీక్ష కేంద్రాలను తనిఖీచేశారు.

●ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలంలో 100 మంది పదోతరగతి విద్యార్థులకు 99 మంది విద్యార్థులు పరీక్షు హాజరైనారు. ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ నేతృత్వంతో 144 సెక్షన్ అములులో ఉంది.

●ఇల్లెందుటౌన్: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇల్లెందు పట్టణంలో 5 పరీక్ష కేంద్రాలు, మండలంలోని రెండు కేంద్రాలను కేటాయించారు. ఈ కేంద్రాలలో మొత్తం 1189 మంది విద్యార్థులకు 1184 మంది విద్యార్థులు హాజరైనారు.


అశ్వారావుపేటలోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


చంద్రుగొండలో పరీక్ష కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు


మణుగూరులో పరీక్షకు వస్తున్న విద్యార్థులు


ఇల్లెందులో విద్యార్థుల తనిఖీ

## ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు సత్కారం


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మైనార్టీసంఘ అధ్యక్షుడు

పాల్వంచ, మార్చి 18: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సోమవారం పాల్వంచలో స్థిరపడిన తన బాల్య స్నేహితుడు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు యాకూబ్‌పాషాను కలుసుకున్నారు. ఎమ్మెల్యే హోదాలో వచ్చిన వెంకట్రావును యాకూబ్‌పాషా సత్కరించారు. డాక్టర్‌గా ఏ రీతిలో విజయవంతం అయ్యారో అదే విధంగా రాజకీయాల్లోనూ విజయవంతంకావాలని యాకూబ్‌పాషా ఆకాంక్షించారు.

## సింగరేణిలో ఖాళీలను భర్తీ చేయాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 18 : సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కార్యదర్శి కోటా శివశంకర్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం జనరల్ మేనేజరు (పర్సనల్ ) బసవయ్యకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ఉద్యోగనియామకాలు చేపట్టకపోవడం వల్ల సింగరేణిలో ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బాల్య వివాహంపై కేసు నమోదు

దమ్మపేట, మార్చి 18: బాలికను వివాహం చేసుకున్న ఘటనలో యువకుడి కుటుంబసభ్యులతో పాటు బాలిక కుటుంబసభ్యులపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈనెల 15న అదే గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకున్నాడు. దీనిపై చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి జ్యోతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాల కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

## యువకుడిపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, మార్చి 18: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న ఓ యువకుడిపై సోమవారం పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలో బాలికను(15) ఓ యువకుడు గత ఏడాదిగా ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. ఇదే తరుణంలో రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లి బాలికను వేధించాడు. దీనిపై బాదితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడులు

దమ్మపేట, మార్చి 18: మండలంలోని కొడిసెలగూడెంలో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.2982 నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరి అరెస్ట్ చేశారు. రెండు కోడి పుంజులను, 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోగా 8మంది పరారీలో ఉన్నారు. దాడుల్లో ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 18: మండలంలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం బుధవారం శ్రీసీతారామచంద్ర స్వామి పరివార దేవతామూర్తుల విగ్రహాలు, శిఖర, ధ్వజ, యంత్ర ముత్యాలమ్మ అమ్మవారి సహిత బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠా ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, నిర్వాహకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## వలస ఆదివాసీ గ్రామంలో దుస్తుల పంపిణీ


పంపిణీ చేస్తున్న సింగరేణి ఉద్యోగి వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, మార్చి 18: మణుగూరు రైల్వే స్టేషన్ సమీపంలోని అశ్వాపురం మండలానికి చెందిన మారుమూల అడవీప్రాంతంలోని వలస ఆదివాసీ గ్రామం రాయన్నపేట యువకులకు సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. ఏరియాలోని ఓసీ-2 డీసీ ఎలక్ట్రిల్ సెక్షన్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తోన్న డీ వెకంటేశ్వర్లు తన తాతా దాసరి లక్ష్మయ్య జ్ఞాపకార్థం దుస్తులతో పాటు గ్రామస్తులకు భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ సభ్యులు మాట్లాడారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతలోబాగంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల శంకర్, సామాజిక కార్యకర్త మంగయ్య, సేవా సమితి సభ్యులు అంగోతు మంగిలాల్, శివ, సురేష్, దేవెందర్, శ్రీను, లక్ష్మీ, చుక్కమ్మ పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అర్బన్ పార్క్‌లో అటవీ సిబ్బంది స్వచ్ఛ కార్యక్రమం


పార్క్‌లో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

మణుగూరురూరల్, మార్చి 18: మణుగూరు పట్టణంలోని గుట్టమల్లారం ప్రాంతాంలో అటవీశాఖ అర్బన్ పార్కులో అటవీ సిబ్బంది సోమవారం చెత్త తొలగించి శుభ్రం చేసే పనులను చేపట్టారు. పార్కులో తొలగించిన చెత్తను కాల్చి బూడిదచేసారు. పార్కును సందర్శించిన ప్రజలు పడేసిన క్యారీ బ్యాగులు, చెత్తతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు శుభ్రం చేసారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ద్వాలియ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడిని నివారించాలి

జూలూరుపాడు, మార్చి18: వేసవిలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు కోరారు. తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ సోమవారం జూలూరుపాడులో ఎంపీవో తులసీరాంకు ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.

## ప్రతీ గ్రామంలో భగత్‌సింగ్, రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల వర్ధంతి

● పీడీఎస్‌యూ, పీవైఎల్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాలు

పాల్వంచ టౌన్, మార్చి 18: స్వాతంత్ర్య పోరాట యోధులు, భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల 93వ వర్ధంతిని గ్రామ గ్రామన ఘనంగా జరుపుదామని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నటరాజ్‌సెంటరులో వర్ధంతిని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హజరైన ఇఫ్టూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ స్ఫూర్తితో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ పాసిస్టు మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమల్ల మల్లయ్య, మంకెన వెంకటేశ్వర్లు, ఎర్రం శ్రీనివాస్, కళింగరెడ్డి, రాము, రాజు, రమేష్, మైసా, ఎన్. భాస్కర్, ప్రసాద్, పవన్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ కేంద్రం మూసివేత

అశ్వారావుపేట రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ కేంద్రాన్ని ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చిన తరుణంలో తాత్కాలికంగా మూసివేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, రాయితీ సిలిండర్‌కు సంబందించి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంచి ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరుణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని మూసివేసినట్టు తెలిపారు. దరఖాస్తుదారులు ఎవరూ మండల పరిషత్ కేంద్రానికి రావద్దని ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు.

## జనక్‌ప్రసాద్‌కు ఐఎన్‌టీయూసీ అభినందనలు


జనక్ ప్రసాద్‌ను అభినందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 18: రాష్ట్ర కనీస వేతన అడ్వయిజరీ బోర్డుచైర్మన్‌గా ఎన్నికైన సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌ను ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. సోమవారం జనక్ ప్రసాద్‌ను ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కార్యదర్శి త్యాగరాజన్, కేంద్రకమిటీ సభ్యులు అల్బర్ట్, ఆర్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మణుగూరు, మార్చి 18: సైబర్ నేరాల పట్ల ప్రజలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు పోలీసులు మంగళవారం జడ్పి ఉన్నత పాఠశాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరికీ బ్యాంకు ఎకౌంట్ వివరాలు, ఏటిఎం పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లు చెప్పొదన్నారు. ఫోన్ల ద్వారా కొందరు సైబర్ నేరగాళ్లు ఈ వివరాలను సేకరిస్తూ నగదును దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## దుమ్ముగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఈదయ్య



దుమ్ముగూడెం మార్చి 18: దుమ్ముగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా చర్ల ఎంపీడీవో కె ఈదయ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ఎం చంద్రశేఖర్ డిప్యూటేషన్‌పై సైనిక్ వెల్ఫేర్ శాఖకు వెళ్లారు. ఈవోఆర్‌డీ ముత్యాలరావు, సూపరింటెండెంట్ సునందన్, జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు, టైపిస్టు శ్రావణి, ఈజీఎస్ ఏపీఓ సుకన్య తదితరులు ఎంపీడీఓను శాలువా కప్పి సన్మానించారు.

## పొదెం నియామకం పట్ల హర్షం

దుమ్ముగూడెం మార్చి 18: రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పొదెం వీరయ్య నియామకం పట్ల మండల కాంగ్రెస్ శ్రేణులు సోమవారం వేడుకలు నిర్వహించారు. ములకపాడు సెంటర్‌లో బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేశారు. నాయకులు లంకా శివకుమార్, చంటి, వెంకటరమణారెడ్డి, నారాయణమూర్తి, హరికృష్ణ, మాజీ సర్పంచి చిన్నారావు, కంగాల వెంకటేష్, కట్టం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పొదెంకు పదవి దక్కడం పట్ల తెలుగుదేశం అధ్యక్షుడు కొమరం దామోదరావు హర్షం ప్రకటించారు.


కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మిల్లు రాములు కన్నుమూత

● సంతాపం తెలిపిన సీపీఎం జిల్లా నాయకులు


రాములు(ఫైల్)

మణుగూరు రూరల్, మార్చి 18: మండలంలోని పగిడేరు గ్రామానికి చెందిన కుంజా రాములు అలియాస్ మిల్లు రాములు (92) మంగళవారం ఆనారోగ్యంతో మృతి చెందాడు. కుగ్రామంగా ఉన్న పగిడేరులో వరిమర్పిడి యంత్రాన్ని గ్రామానికి పరిచయం చేసి తన ఇంటి పేరు నే మిల్లు రాములుగా మార్చుకున్నాడు. ఇతనికి ఐదుగురు కుమారులు ఉన్నారు. ఈ కుటుంబంలో కుంజా బాబూరావు సతీమణి కుంజా కృష్ణకుమారి మాజీ సర్పంచ్, ఎంపిటీసీ ఇటీవలే మృతిచెందారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, భూక్యా రమేష్, బత్తుల వెంకటేశ్వర్లు, కోడిశాల రాములు, దామళ్ల లెనిన్, నరసింహారావు, పాపారావు, పగిడేరు సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు సంతాపం ప్రకటించారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

» పోషన్ పక్వాడలో సీడీపీవో విజయలక్ష్మి

కరకగూడెం/దుమ్ముగూడెం, మార్చి 18: అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు పోషక ఆహారంతోనే దృడత్వంగా ఉంటారని పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని మాదన్నగూ డెం వలస ఆదివాసీ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం సూపర్‌వైజర్ భద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా సీడీపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషక ఆహారం, చిరు ధాన్యాలపై, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద ఆకు కూరలు, కూరగాయాలు పెంచుకుని వాటిని తీనాలని సూచించారు. గర్భిణీలు ప్రతీ నెల వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి భద్రమ్మ, జీ పద్మ, తల్లితండ్రులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఆర్లగూడెంలో సోమవారం సెక్టార్ లెవల్ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో నవ్యశ్రీ, వైద్యాధికారి డాపుల్లారెడ్డి గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారాలను వివరించారు. శ్రీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, పోషణ అభియాన్ మౌనిక, లక్ష్మీదేవి, లబ్దిదారులు పాల్గొన్నారు.

### సాముహిక సీమంతాలు

దిబ్బగూడెం గ్రామంలో అంగన్‌వాడి ఆధ్వర్యంలో సాముహిక సీమంతాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దిబ్బగూడెం, మారప్పగూడెం గ్రామాలకు చెందిన ఆరుగుమహిళలకు అంగన్‌వాడి టీచర్లు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు తిరుపతమ్మ, చిట్టెమ్మ, రాములమ్మ, నాగమణి, కె.శ్యామల, నీలమ్మ, నాగమణి, శ్యామల నీలమ్మ, సీతామహలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కరకగూడెంలో అవగాహన కార్యక్రమం

## ముదిరాజ్‌లను విస్మరించిన గత పాలకులు

●ఎమ్మెల్యే కోరం ●ముదిరాజ్‌ల కోసం కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం


ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

ఇల్లెందుటౌన్, మార్చి 18: ముదిరాజ్‌లను గత పాలకులు విస్మరించారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరోపించారు. సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఘనంగా సత్కరించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న ముదిరాజ్‌లను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకుండా మరుగున పడేవిధంగా చేసిందన్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజులను గుర్తించి, కార్పొరేషన్ పదవులను కట్టబెట్టిందన్నారు. ముదిరాజుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనియం అన్నారు. ఇల్లెందులో ముదిరాజుల కోసం ప్రత్యేకంగా భవనం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం సోనియాగాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలను పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కౌన్సిలర్ వారా రవి, ముదిరాజ్ సంఘం నాయకుడు చెన్నబోయిన వెంకన్న, డాక్టర్ పురుషోతం , సదానందం, సాగర్, రాజయ్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో అసౌకర్యం కలుగకుండా చర్యలు

» ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి » పోలింగ్ కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు, మార్చి 18: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులను కల్పించి ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని వెంగన్నపాలెం, గుండెపుడి, అనంతారం, ముద్దులగూడెం, కాకర్ల, దుబ్బతండా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వసతుల వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు నిబంధలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నానిబాబు, లక్ష్మీనారయణ, హారిక తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో